Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..


సంపుటి : 1 | సంచిక : 145 | హైదరాబాద్ | సోమవారం 05-02-2024 | పేజీలు : 6 | వెల : రూ. 4/-




## కేఆర్ఎంబీ కి కృష్ణా ప్రాజెక్టుల అప్పగింత



**తెలంగాణ వీణ, హైదరాబాద్ :** కొన్నిరోజుల కిందట హైదరాబాదులో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం నిర్వహించగా, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఈఎన్సీలు, ఇతర ముఖ్య అధికారులు హాజరయ్యారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలు కేఆర్ఎంబీకి అప్పగించాలని ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ ఈఎన్సీలు అంగీకరించారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేడు హైదరాబాదులో కీలక ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన, కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడంపై వివరణ ఇచ్చారు. కృష్ణా, గోదావరి నదులపై ఉన్న ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి స్వాధీనం చేసే అంశంలో కేసీఆర్, హరీశ్ రావు, కేటీఆర్ లదే తప్పు అని విమర్శించారు. ఈ ముగ్గురు తాము చేసిన పాపాలు కప్పి పుచ్చి, ఆ పాపాలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వంపైకి నెట్టివేసి, ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారాలు చేస్తూ అంతిమంగా రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నదులపై నిర్మించిన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి చెందిన రివర్ మేనేజ్ మెంట్ బోర్డులకు స్వాధీనం చేయాలని రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్-84, 85, 86, 87, 88, 89లతో స్పష్టంగా పేర్కొన్నారని రేవంత్ రెడ్డి వివరించారు. ఎన్నో రాత్రులు నిద్రపోకుండా ఈ పునర్ విభజన చట్టాన్ని తానే రాయించానని కేసీఆర్ చెబుతున్నాడు కాబట్టి, ఇప్పుడు ఆయననే సూటిగా ప్రశ్నిస్తున్నాం... 2014లో కేసీఆర్ పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు పార్లమెంటులో పునర్ విభజన చట్టం ఆమోదం పొందింది. ఈ చట్టానికి మీరే రచయిత అయినప్పుడు... మీరే కథ, కథనం నిర్వహించినప్పుడు... కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేందుకు ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మాపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారు?



మీరు 2014లో ఎంపీగా ఉన్నప్పుడే ప్రాజెక్టుల అప్పగింతకు పునాదిరాయి పడింది. మీ అనుమతి మేరకు, మీ సూచన మేరకే నాటి కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది. లోక్ సభలో, రాజ్యసభలో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టినప్పుడు మీరు కూడా ఈ చట్టానికి ఓట్లు వేసి ఆమోదించారు. ఇవాళ ఈ ప్రాజెక్టులు కేంద్రానికి అప్పగించడం వల్ల తెలంగాణ ప్రజలకు నష్టం కలుగుతుంది అంటే అందుకు బాధ్యులు కేసీఆర్, కేశవరావు. కేసీఆర్ నాడు లోక్ సభలో ఉన్నారు, కేశవరావు రాజ్యసభలో ఉన్నారు. కృష్ణా నదీ ప్రాజెక్టుల ద్వారా అప్పట్లో ఉమ్మడి రాష్ట్రానికి బచావత్ ట్రైబ్యునల్ కేటాయించింది 811 టీఎంసీలు. అయితే, రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీటిని పంపకాలు చేశారు. మరి ఇప్పుడు కృష్ణా నది నీటిలో సగం వాటా కావాలంటున్నవారు అప్పుడెందుకు అడగలేదు? కృష్ణా నదీ పరీవాహక ప్రాంతం తెలంగాణలో 68 శాతం, ఏపీలో 32 శాతం ఉంది. ఏ ప్రాంతంలో ఎక్కువ నదీ పరీవాహక ప్రాంతం ఉంటుందో, అంత శాతం ఆ ప్రాంతానికి నీటి కేటాయింపులు ఉండాలని అంతర్జాతీయ విధివిధానాలు చెబుతున్నాయి. ఆ లెక్కన 500 పైచిలుకు టీఎంసీల నీరు తెలంగాణకు, 200 పైచిలుకు టీఎంసీల నీరు మాత్రమే ఏపీకి పోవాలి. కానీ పరిస్థితి పూర్తిగా విరుద్ధంగా ఉంది. తెలంగాణకు రావాల్సిన నీటి వాటా రాకుండా, ఆ హక్కులను ఏపీకి ధారాదత్తం చేసిన దుర్మార్గుడు ఎవరైనా ఉన్నారంటే అది కల్వకుంట్ల చంద్రశేఖర్ రావే. ఇప్పుడు తెలంగాణకు ఏదైనా నష్టం జరిగితే అందుకు బాధ్యులు కేసీఆర్, హరీశ్ రావు, ఈఎన్సీ మురళీధర్ రావు. 2015లో కేఆర్ఎంబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వీళ్లు ఆమోదించడం ద్వారా తెలంగాణకు తీరని నష్టం కలుగజేశారు" అంటూ రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

## రైతులకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్ పంటలకు బోనస్



**తెలంగాణ వీణ , హైదరాబాద్ :** తెలంగాణ రైతులకు గుడ్ న్యూస్ చెప్పేందుకు రేవంత్ సర్కార్ సిద్ధవుతోంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కీలక ప్రకటన చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర వ్యాధులు సోకటం వల్ల పంట నష్టపోయే రైతులకు "పంటల బీమా" ఇవ్వడం గురించి ప్రభుత్వం ఆలోచిస్తోందని మంత్రి తెలిపారు. మరోవైపు ఈ ఖరీఫ్ సీజన్ నుంచే పంటలకు ప్రభుత్వం బోనస్ ఇచ్చే అవకాశం ఉందంటూ మంత్రి గుడ్ న్యూస్ తెలిపారు. ఇప్పుడు జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో.. వ్యవసాయానికి పెద్దపీట వేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఆదివారం రోజున గ్లోబల్ రైస్ సమ్మిట్ బ్రోచర్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన మంత్రి.. జూన్ 4 నుంచి 6 వరకు హైదరాబాద్ తాజ్ డెక్కన్ హోటల్‌లో గ్లోబల్ రైస్ సమ్మిట్ జరగనుందని తెలిపారు. దేశానికి అన్నం పెట్టే స్థానంలో తెలంగాణ ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బియ్యం ఎగుమతులపై నిషేదం విధించిందని.. ఈ నిర్ణయం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతులకు మేలు చేసేలా కేంద్రం ఆలోచించాలని సూచించారు.

## కాంగ్రెస్ దుష్ప్రచారం వల్లే బీఆర్ఎస్ ఓటమి : మాజీ మంత్రి హరీశ్‌రావు

- బీఆర్ఎస్‌పై ప్రజల్లో విశ్వాసం ఉందని వ్యాఖ్య
- ఏం జరిగినా మంచికేనన్న హరీశ్ రావు
- పటాన్‌చెరు నియోజకవర్గ పార్టీ నేతల సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు



**తెలంగాణ వీణ, హైదరాబాద్ :** తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం ఉందని, అయితే కాంగ్రెస్ దుష్ప్రచారం కారణంగానే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో కేవలం 1.08 శాతం ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యామని, ఏం జరిగినా తమ మంచికేనని అన్నారు. అధికారంలోకి వస్తే ఫిబ్రవరి 1న గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారని, నోటిఫికేషన్ వచ్చిందా? అని ఆయన ప్రశ్నించారు. పటాన్‌చెరు నియోజకవర్గ పార్టీ నేతల సమావేశంలో హరీశ్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు.

## పద్మ పురస్కార గ్రహీతలకు ప్రభుత్వ సన్మానం

**తెలంగాణ వీణ , హైదరాబాద్ :** ఈ ఏడాది పద్మ పురస్కారాలకు ఎంపికైన వారిని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. హైదరాబాద్ లోని శిల్పకళావేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మెగస్టార్ చిరంజీవిలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాలువా, మెమెంటోలతో సత్కరించారు. వీరితో పాటు పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన దాసరి కొండప్ప, గడ్డం సమ్మయ్య, ఆనందాచారి, కేతావత్ సోమ్‌లాల్, కూరెళ్ల విఠలాచార్యలను సీఎం ఘనంగా సన్మానించారు.



తెలంగాణ ప్రభుత్వం తరఫున వారిని సత్కరించినట్లు చెప్పారు. అవార్డు అందుకోనున్న ఈ ప్రముఖులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.25 లక్షల నగదు పురస్కారం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కళాకారులను గౌరవించే రాజ్యం సుభిక్షం: చిరంజీవి

కళాకారులను సముచితంగా గౌరవించే రాజ్యం ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉంటుందని మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చిరంజీవిని పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపిక చేయడంతో తెలంగాణ ప్రభుత్వం ఆయనను సన్మానించింది. శిల్పకళావేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపికయ్యానని తెలిసిన క్షణంలో చాలా సంతోషం కలిగిందని అన్నారు. అభిమానుల ఆశీర్వాదం చూస్తుంటే తన జన్మధన్యమైనట్లు అనిపిస్తోందని అన్నారు. పద్మ పురస్కారాలు ప్రకటించిన తర్వాత కూడా సన్మానం చేయాలనే ఆలోచన ఇంతవరకూ ఎవరికీ రాలేదన్నారు. కొన్నేళ్లుగా నంది అవార్డులు ఇవ్వకపోవడంపై నిరుత్సాహం వ్యక్తం చేసిన మెగాస్టార్. తాజాగా నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మెచ్చుకున్నారు. ఇకపై ఏటా గద్దర్ అవార్డులు ఇస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనను స్వాగతించారు. కళాకారులకు అందించే పురస్కారాలు వారికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.



తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..

# హైదరాబాద్


## అవార్డు గ్రహీతలకు నగదు బహుమతిని ప్రకటించిన సీఎం రేవంత్




**తెలంగాణవీణ , హైదరాబాద్ :** చిరంజీవి, వెంకయ్య నాయుడుకుతో పాటు మరికొంతమంది కవులకు, కళాకారులకు అవార్డులు ప్రకటించింది కేంద్రప్రభుత్వం. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో ఉండి వారి ఎంచుకున్న కళలకు జీవితాంతం సేవ చేసినందుకు వారికి పద్మ అవార్డులు రావటం.. ప్రతిష్టాత్మక పద్మ అవార్డ్స కు ఎంపికైన వారిని తెలంగాణ సర్కార్ సత్కరించింది. చిరంజీవి, వెంకయ్య నాయుడుకు పద్మ విభూషణ్ అవార్డు ను ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. చిరంజీవి, వెంకయ్య నాయుడుకుతో పాటు మరికొంతమంది కవులకు, కళాకారులకు అవార్డులు ప్రకటించింది కేంద్రప్రభుత్వం. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో ఉండి వారి ఎంచుకున్న కళలకు జీవితాంతం సేవ చేసినందుకు వారికి పద్మ అవార్డులు రావటం నిజంగా ఆనందదాయకం అన్నారు రేవంత్ రెడ్డి.మాట్లాడుతూ.. "చిరంజీవి, వెంకయ్య నాయుడు గారికి పద్మ విభూషణ్ రావటం సముచితం. కవులకు,కళాకారులకు అవార్డు వస్తున్నాయి కానీ ఆర్థికంగా వెనుకబడి ఉన్నారు. ప్రతి ఒక్క పద్మశ్రీ అవార్డు గ్రహీత కు పాతిక లక్షల రూపాయల నగదు బహుమతిని ప్రకటిస్తున్నాం. కళలను బ్రతికించుకోవాలంటే అందరూ రాజకీయాలకతీతంగా ముందుకు రావాలి అన్నారు రేవంత్ రెడ్డి. వెంకయ్య నాయుడు చిరంజీవి గారి చేతుల మీదుగా పద్మశ్రీ బాటిల్ రైతులకు నగదు బహుమతి అందజేయాలని కోరుతున్నాం. అంతేకాకుండా ప్రతి నెల వారి ఖర్చులకోసం పెన్షన్ అందిస్తున్నాం..పాతిక వేల రూపాయల పెన్షన్ కూడా అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వెంకయ్య నాయుడు గారికి రాష్ట్రపతి పదవి కూడా దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అని రేవంత్ రెడ్డి అన్నారు.

## పద్మవిభూషణ్ అవార్డుల ప్రకటన వెనుక మోదీ వ్యూహమదే.. : చిరంజీవి



**తెలంగాణ వీణ , హైదరాబాద్ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్రం ఇటీవల పద్మ అవార్డులను ప్రకటించింది. అవార్డులకు ఎంపికైన తెలుగువారిని తెలంగాణ సర్కారు శిల్పకళా వేదికగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటుగా డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. అవార్డు గ్రహీతలకు ప్రభుత్వం తరుపున 25 లక్షల నగదును అందజేశారు. ఈ సందర్భంగానే పద్మవిభూషణ్ అవార్డులకు ఎంపికైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవిలను ప్రభుత్వం సత్కరించింది .ఈ కార్యక్రమంలో మాట్లాడిన చిరంజీవి.. పద్మవిభూషణ్ అవార్డు ప్రకటన కంటే సత్కారం ద్వారా ఎక్కువ సంతోషం కలుగుతోందని అన్నారు. అవార్డు ప్రకటన వెంటనే ఇలాంటి సత్కారాలు చేయడం ఇదే తొలిసారని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయాలపై మెగాస్టార్ తన మనసులోని మాటను బయటపెట్టారు. వ్యక్తిగత విమర్శలతో రాజకీయాలు దిగజారాయని చిరంజీవి అభిప్రాయపడ్డారు. మాటలు పడలేకే రాజకీయాల్లో ఉండలేకపోయానని చెప్పుకొచ్చారు. రాజకీయాల్లో హుందాతనం లోపించిందన్నారు మెగాస్టార్. రాను రాను రాజకీయాలు వ్యక్తిగత కక్షలతో నిండిపోయాయని.. దుర్భాషలాడే నాయకులను ప్రజలే తిప్పికొట్టాలని కోరారు. అలాగే రాజకీయాల్లో నిజమైన రాజనీతిజ్ఞుడు అంటే వెంకయ్యనాయుడేనన్నారు చిరంజీవి.వాజ్‌పేయి అంత హుందాతనం వెంకయ్యలో ఉందని కొనియాడారు.

ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డుల పేరు మార్చడంపైనా మెగాస్టార్ తన అభిప్రాయాన్ని తెలియజేశారు. నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా పేరు మార్చడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. త్వరలోనే అవార్డులు ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడం మరింత ఆనందాన్ని కలిగించిందన్నారు. కళాకారులను గుర్తించి, గౌరవించే రాజ్యం సుభిక్షంగా ఉంటుందన్న చిరంజీవి.. అవార్డులు కళాకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తాయని చెప్పుకొచ్చారు.

ఇక ఈ సభలోనే మరో ఆసక్తికర విషయాన్ని మెగాస్టార్ చిరంజీవి పంచుకున్నారు. పద్మ అవార్డుల ప్రకటన సమయంలో ప్రధాని మోదీ ఓ వ్యూహం ప్రకారం వెళ్లారని చిరంజీవి చెప్పుకొచ్చారు. తొలుత పద్మశ్రీ విజేతలను ప్రకటించిన కేంద్రం.. ఆ తర్వాత గంటన్నర వరకూ పద్మ విభూషణ్ అవార్డులను ప్రకటించలేదు. దీనికి గల కారణాన్ని చిరంజీవి వివరించే ప్రయత్నం చేశారు. పద్మశ్రీ అవార్డుల ప్రకటన తర్వాత గంటన్నర సమయం తీసుకోవడం ద్వారా పద్మశ్రీ అవార్డు విజేతల గురించి చర్చ జరగాలన్నేదే మోదీ వ్యూహమని చిరంజీవి చెప్పారు. ఈ విషయం మొదట తనకు తెలియదనీ, తెలిసిన తర్వాత మోదీ మీద గౌరవం మరింత పెరిగిందని చెప్పారు.

## ఆటో EMI కట్టలేకపోతున్నాం.. హరీష్ రావుతో ఆటో డ్రైవర్లు



**తెలంగాణవీణ, హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరువులో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పర్యటించారు. పటాన్ చెరు బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు హరీశ్ రావు. ఈ సందర్భంగా పలువురు ఆటో కార్మికులు ఈఎంఐలు కూడా చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో రోడ్డున పడ్డామని వాపోయారు. మాకు సహాయం చేయాలని కోరారు. ప్రభుత్వాన్ని వేడుకున్నట్లు తెలిపారు. కుటుంబ పోషణకు ఆటో నడపడం ఒక్కటే మార్గమని దిక్కని తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఉచిత బస్సు మంచిదే అయినా కస్టమర్లు లేక ఆటోలు నడపలేకపోతున్నామని అన్నారు. రోజుకు రూ.100 కూడా సంపాదించే పరిస్థితి లేదని వాపోయారు. కొత్త తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనిపై స్పందించిన హరీష్ రావు.. ఆటో డ్రైవర్లకు అండగా నిలుస్తామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాసమస్యల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని ఆటోడ్రైవర్‌లకు హితవు పలికారు. 6.5 లక్షల మంది ఆటోడ్రైవర్ల తరపున అసెంబ్లీలో బీఆర్ఎస్ గళం వినిపిస్తామన్నారు. ఆత్మహత్యల వంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ప్రభుత్వం నెలకు 10 వేలు ఇచ్చే వరకు పోరాడుతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ఆటో కార్మికులు తదితరులు ఉన్నారు. KRMB విషయంలో కాంగ్రెస్ చేతులెత్తేసిందని అన్నారు. మేం గెలిచాక 15 వేల రైతుబంధు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని అన్నారు. వడ్లకు బోనస్, వృద్ధాప్య పెన్షన్ పెంపు, 2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ ప్రచారం చేశారని,, ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టింది..12 మంది డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల కరెంట్ ఇస్తే ఇప్పుడు 15 నుంచి 16 గంటల కరెంటు వస్తుందన్నారు. కాంగ్రెస్ వచ్చాక ఇన్వెటర్లు, జనరేటర్లకి డిమాండ్ పెరిగిందన్నారు. గల్లీలో, ఢిల్లీలో ఎవరన్నా తెలంగాణ ప్రజల తరపున పోరాడేది BRS మాత్రమే అన్నారు. మమతా బెనర్జీ కాంగ్రెస్ పార్టీని 40 సీట్లు తెచ్చుకోమని ఛాలెంజ్ చేసిందని, ఇండియా కూటమి పనిఅయిపోయింది..ఒక్కొక్కరు కూటమి నుంచి బయటికి వస్తున్నారని తెలిపారు. మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చితే మేం శభాష్ అంటామన్నారు. నిరుద్యోగులకు ఫిబ్రవరి 1న గ్రూప్ నోటిఫికేషన్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మనకి స్పీడ్ బ్రేకర్ లాంటివన్నారు. రాజస్తాన్, ఛత్తీస్ ఘడ్ లో ఐదేళ్లకే కాంగ్రెస్ ఇంటి బాట పట్టిందన్నారు. బీజేపీ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఒక్క రూపాయి అయినా తెలంగాణకి తెచ్చాడా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో అధికారంలో వచ్చే పరిస్థితి లేదన్నారు. రాముడు అందరి వాడు..రాజకీయంగా వాడుకొని ఓట్లు అడుగుతామంటే ఎవరు వెయ్యరన్నారు. ఏం చేశారో చెప్పుకోవడానికి ఏం లేక దేవుడి పేరుతో ఓట్లు అడుగుతున్నారన్నారు.

## మరో ఉద్యమానికి బీ ఆర్ ఎస్ శ్రీకారం



**తెలంగాణ వీణ , హైదరాబాద్ :** కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ బీఆర్ఎస్ యుద్ధానికి సిద్ధమవుతోంది. ప్రధానంగా కృష్ణా జలాల అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ కార్యాచరణ రూపొందిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కృష్ణా జలాల అంశాన్ని ప్రచారాస్త్రంగా మలుచుకునేందుకు బీఆర్ఎస్ వ్యూహం రచిస్తోంది. కృష్ణా జలాల్లో వాటా తేల్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ చలో నల్లగొండకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది.

**నల్లగొండలో లక్ష మందితో భారీ బహిరంగ, పాదయాత్ర..**

కృష్ణా జలాలతో అత్యధిక లబ్ధి పొందుతున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంగా బీఆర్ఎస్.. రేవంత్ సర్కార్ పై పోరాటానికి సిద్ధమవుతోంది. ఛలో నల్లగొండ పేరుతో ఈనెలలో భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. లక్ష మందితో నల్లగొండలో భారీ బహిరంగ సభను నిర్వహించాలని ఆ పార్టీ భావిస్తోంది. నల్లగొండ భారీ బహిరంగ సభ తర్వాత పార్టీ నేతలు నాగార్జున సాగర్ వరకు పాదయాత్ర నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు పార్టీ శ్రేణులకు అధిష్టానం సమాచారం అందించింది.కృష్ణా జలాలకు సంబంధించి సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకోవడం, అంతకుముందు ఆంధ్రా అధికారులు అనుమతి లేకుండా నీటిని విడుదల చేసుకోవడం వంటి పరిణామాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. కృష్ణా జలాల విషయంలో రేవంత్ సర్కార్ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీనేలా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కేఆర్ఎంబీకి కృష్ణా నదిపై ఉన్న ఉమ్మడి ప్రాజెక్టులను అప్పగించడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుబట్టింది. కృష్ణా జలాల అంశాన్ని బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా మలుచుకోనుంది. తెలంగాణ వాటా తేల్చకుండానే ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం ఏంటని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేత కాదనడానికి ఇదే ఉదాహరణ అని విమర్శించింది. రేవంత్ సర్కార్ ప్రాజెక్టులను ఢిల్లీ ప్రభుత్వ చేతుల్లో పెట్టిందని బీఆర్ఎస్ విరుచుకు పడుతోంది.

ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినే పరిస్థితి నెలకొందని ఆరోపించింది. భవిష్యత్తులో ఏ ప్రాజెక్ట్ కట్టాలన్నా.. ప్రాజెక్ట్ నుంచి చుక్క నీరు తీసుకోవాలన్న వారి అనుమతి తీసుకోవాల్సిన పరిసితి ఉంటుందని బీఆర్ఎస్ చెబుతోంది. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడి విఫలమయ్యారని ఆరోపించింది. గతంలోనే దీనిపై తాము ప్రభుత్వాన్ని హెచ్చరించామని మాజీమంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించబోమని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అందుకు విరుద్ధంగా వ్యవహరించి తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతినేలా చేసిందని 2021లో నిర్ణయం తీసుకున్నా.. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించలేదని బీఆర్ఎస్ చెబుతోంది.ఇప్పటికే నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడంపై బీఆర్ఎస్ ఎంపీలు నిరసన తెలిపారు. ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసిన ఎంపీలు, కేఆర్ఎంబీ తీసుకునే నిర్ణయాల వల్ల రాష్ట్రానికి కలిగే నష్టాల గురించి వివరించారు. ప్రాజెక్టుల అప్పగింతపై తమకున్న అభ్యంతరాలను తెలుపుతూ లేఖను అందజేశారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కృష్ణా ట్రిబ్యునల్‌లో విచారణ పూర్తయ్యేవరకు ఇరు రాష్ట్రాలకు 50:50 పద్ధతిలో నీటి కేటాయింపులు ఉండేలా చూడాలని కోరారు.

**కృష్ణా జలాలపై ఉద్యమ పార్టీగా గళమెత్తిన బీఆర్ఎస్..**

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా కృష్ణా జలాల్లో జరుగుతున్న అన్యాయంపై 2003 ఆగస్టు 26న కోదాడ నుండి కేసీఆర్ పాదయాత్ర చేపట్టారు. నాలుగు రోజలపాటు సాగిన పాదయాత్ర హాలియాలో బహిరంగ సభతో ముగిసింది. 2004లో ఫ్లోరైడ్‌పై అధ్యయన కోసం కేసీఆర్ రెండ్రోజుల బస్సు యాత్ర చేపట్టారు. మర్రిగూడ, నాంపల్లి, చండూర్, నార్కట్‌పల్లి మండలాల్లో పర్యటించి ఫ్లోరైడ్ బాధితులతో కేసీఆర్ భేటీ అయ్యారు. ఈ సమయంలోనే గుండె నిండా ఫ్లోరైడ్ బండా... తల్లడిల్లే నల్లగొండ అంటూ స్వయంగా కేసీఆర్ పాట రచన చేశారు. మొత్తానికి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ కృష్ణా జలాల్లో వాటా కోసం మరోసారి పోరాటానికి సన్నద్ధమవుతోంది.

## ఇక నుంచి TS కాదు TG..?




**తెలంగాణ వీణ , హైదరాబాద్ :** సంచలన నిర్ణయాలతో పాలనలో తన మార్కు చూపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన నెంబర్ ప్లేట్లపై టీఎస్ (TS- Telangana State) అనే అక్షరాలు ఉండేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయి.. తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణ స్టేట్ అని వచ్చేలా TS అని షార్ట్ ఫాంని ప్రభుత్వం రిజిస్టర్ చేయించింది. కేవలం నెంబర్ ప్లేట్లపైనే కాకుండా.. అన్ని ప్రభుత్వ సంస్థలకు కూడా తెలంగాణ స్టేట్ అని వచ్చేలా పేర్లు మారిపోయాయి. అయితే.. ఇప్పుడు కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం దాన్ని మార్చాలన్న ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటివరకు 'టీఎస్' అనే షార్ట్ ఫాంను.. ఇప్పుడు టీజీ (TG- Telanga-na) గా మార్చనున్నట్టు తెలుస్తోంది. రేపు జరగబోయే కేబినెట్ సమావేశంలో ఈ 'టీజీ' అంశానికి ఆమోదం తెలపనున్నట్టు సమాచారం.

అయితే.. తెలంగాణ ఏర్పడిన సమయంలోనే "టీజీ"గా నిర్ణయిస్తారని అందరూ భావించారు. అప్పటికే ఉద్యమం సమయంలోనూ తెలంగాణను టీజీగా మాట్లాడుకునేవారు. పలు బోర్డులపై ఏపీ అనే స్థానంలో టీజీ అని కూడా రాసేవారు. కానీ.. అనూహ్యంగా టీఎస్ అని తెలంగాణ పేరును కేసీఆర్ సర్కార్ రిజిస్ట్రేషన్ చేపించింది. దీనిపై మొదట్లో ఒకింత వ్యతిరేకత కూడా వచ్చింది. అయితే.. 'టీజీ' అంటే తెలంగాణ అనే ఒకే పదాన్ని రెండుగా విభజించినట్టవుతుందని.. అది ఒకటే పదంగా ఉంచేందుకే తెలంగాణ స్టేట్ అని వచ్చేలా 'టీఎస్' అనే అక్షరాలను రిజిస్టర్ చేపించినట్టు పలువురు వివరించారు. మనలాగే కర్ణాటక రాష్ట్రానికి కూడా కేఎస్ (KS) అనే ఉంటుందని.. కూడా ఉదాహరణలు చెప్పారు.

అయితే.. ఇప్పుడు టీఎస్ కాస్త టీజీగా మారితే మాత్రం కేవలం నెంబర్ ప్లేట్లు మాత్రమే కాదు.. చాలా మార్చాల్సి వస్తుంది. మరి.. కేవలం నెంబర్ ప్లేట్ల మీదే మారుస్తారా.. లేదా మొత్తం మారుస్తారా అన్నది ఇప్పుడు ఆసక్తికర అంశంగా మారింది. ఈ నిర్ణయం తీసుకుంటే మాత్రం ఇది కూడా రాష్ట్రంలో సర్వత్రా దుమారం రేపే అవకాశాలు లేకపోలేదు.

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
ఆంధ్రప్రదేశ్



# ఏపీ రైతులకు జగన్ సర్కార్ శుభవార్త



**తెలంగాణ వీణ , ఏపీ :** వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన విపత్తుల నిర్వహణ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయశాఖ, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మిచౌంగ్ తుఫాన్‌తో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర పరిహారానికి నిధులు ఈ నెలలో విడుదలవుతాయని కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు త్వరలోనే నిధులు కేటాయిస్తామన్నారు. వేసవిలో గ్రామాలు, పట్టణాల్లో తాగు నీటికి ఇబ్బంది లేకుండా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కరవు ప్రభావిత ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాస్తవానికి సంక్రాంతిలోగా రైతుల ఖాతాల్లోకి ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. కానీ కొన్ని అనివార్య కారణాలతో సాధ్యం కాలేదు.. ఈ నెలలో డబ్బుల్ని జమ చేస్తామంటోంది ప్రభుత్వం

# షర్మిలకు అండగా ఉంటా - రాహుల్ గాంధీ



- మహిళలను అవమానించడం నీచం అంటూ మండిపడ్డ కాంగ్రెస్ ఎంపీ
- షర్మిల, వైఎస్ సునీతపై సోషల్ మీడియాలో దాడిని ఖండించిన రాహుల్
- వారికి కాంగ్రెస్ పార్టీతో పాటు తాను అండగా ఉంటానని వెల్లడి

**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** మహిళలను అవమానించడం, వారిపై మాటల దాడి చేయడం నీచమైన పనంటూ కాంగ్రెస్ పార్టీ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఇలాంటి పనిని కేవలం పిరికిపందలు చేస్తారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ చీఫ్ వైఎస్ షర్మిల, వైఎస్ సునీతలపై సోషల్ మీడియా వేదికగా దాడులు జరగడం, చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడడంపై రాహుల్ గాంధీ స్పందించారు. ఆదివారం ఆయన ఈమేరకు ట్వీట్ చేశారు.మహిళలను కించపరచడం, బెదిరించడం పిరికిపందల చర్య అని, దురదృష్టవశాత్తూ శక్తిహీనులకు ఇదొక ఆయుధంగా మారిందని రాహుల్ గాంధీ చెప్పారు. వైఎస్ షర్మిల, వైఎస్ సునీతలపై సోషల్ మీడియాలో దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారిద్దరికీ కాంగ్రెస్ పార్టీతో పాటు తాను కూడా అండగా నిలబడతానని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.

# చిత్తూరు జిల్లాలో ఏనుగు బీభత్సం



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** సమీప అటవీ ప్రాంతం నుంచి తప్పివచ్చిన ఓ ఒంటరి ఏనుగు గ్రామంపై పడి నానా బీభత్సం సృష్టించింది. ఏపీలోని చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం కోనేరు కుప్పం ఎస్.గొల్లపల్లి గ్రామాల్లో సంచరిస్తు భయాందోళనకు గురిచేసింది. రాళ్ల బూదుగూరు వద్ద కారును అడ్డుకుని ధ్వంసం చేసింది. అక్కడి నుంచి పంటపొలాలపై పడి పంటను నాశనం చేసింది. ఏనుగు బీభత్సం పై గ్రామస్థులు అటవీ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ ప్రాంతాలకు చేరుకున్న అధికారులు ఏనుగును అటవీ ప్రాంతంలోకి పంపేందుకు చర్యలు ప్రారంభించారు.

# నేటి నుండి ఏపీ అసెంబ్లీ సమావేశాలు





**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** సోమవారం నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం పది గంటలకు సమావేశాలు ప్రారంభం కానున్నాయి. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో...ఈసారి పూర్తిస్థాయి బడ్జెట్ కాకుండా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. అనంతరం బీఏసీ సమావేశం జరగనుంది. సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. కాగా.. ఏపీ పదిహేనవ అసెంబ్లీకి ఇవే చివరి సమావేశాలు.ఇదిలా ఉంటే.. నియోజకవర్గ ఇంఛార్జ్ బాధ్యత దక్కని పలువురు వైసీపీ సిట్టింగుల్లో ఉత్కంఠ నెలకొంది. రాజ్యసభ ఎన్నికలు, అసంతృప్తులు, రెబల్ ఎమ్మెల్యేలతో లాబీ టాక్స్ ఆసక్తికరంగా మారనున్నాయి.

# ఏపీలో మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** ఆంధ్రప్రదేశ్ లో మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఏపీ ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారులు వెల్లడించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షలు మార్చి 1 నుంచి ప్రారంభమై 20వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు సైతం అదే తేదీల్లో కొనసాగుతాయని, వారి టైంటేబుల్ http:// bie.ap.gov.in ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

# చంద్రబాబుతో పవన్‌కల్యాణ్ కొలిక్కి వచ్చిన సీట్ల సర్దుబాటు



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** ఏపీలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీచేసేందుకు నిర్ణయించుకున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు , జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌మధ్య ఆదివారం మరోసారి సమావేశం జరిగింది. ఉండవల్లిలోని నివాసంలో వీరిద్దరూ భేటి అయి సీట్ల సర్దుబాట్లపై చర్చించారు. జనసేన పోటీ చేసే స్థానాలపై ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం.

# తెలుగు కళామతల్లికి చిరంజీవి మూడో కన్ను: వెంకయ్యనాయుడు



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** పద్మ అవార్డుల గ్రహీతలకు నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. దేశంలోనే రెండో అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ కు ఎంపికైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, పద్మ అవార్డులకు అర్హులను ఎంపిక చేయడంలో కొత్త విధానం కనిపిస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తోందని కొనియాడారు. గుర్తింపు దక్కని వ్యక్తులను గుర్తించి పద్మ పురస్కారాలు ఇస్తోందని వివరించారు. తెలుగు సినీ కళామతల్లికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్ల వంటి వారైతే... చిరంజీవి మూడో కన్ను అని వెంకయ్యనాయుడు అభివర్ణించారు. చిరంజీవికి పద్మ విభూషణ్ అవార్డు రావడం సంతోషం కలిగించిందని అన్నారు. ఇష్టమైన పనిని కష్టపడి చేస్తే నష్టపోయేది ఏదీ ఉండదని... పట్టుదలకు కృషి తోడైతే ఏదైనా సాధ్యమేనని పేర్కొన్నారు.

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
# జనరల్
NEWS


## 23 ఎంఎంటీఎస్ సహా 51 రైళ్లు రద్దు..

**తెలంగాణ వీణ , జనరల్ :** హైదరాబాద్ లో ఎంఎంటీఎస్ ఫేజ్ – 2 పనుల కారణంగా ఎంఎంటీఎస్ సర్వీసులతో పాటు పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మౌలాలి – సనత్ నగర్ మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ నెల 4 (ఆదివారం) నుంచి ఈ నెల 11 వరకు 23 ఎంఎంటీఎస్ రైళ్లతో పాటు మొత్తం 51 రైళ్లను రద్దు చేసినట్లు చెప్పారు. ఈ రైళ్లను టైం టేబుల్ ప్రకారం రద్దు చేసినట్లు వివరించారు. వీటిలో ఈ నెల 9 వరకు మూడు ఎంఎంటీఎస్‌లు, 10వ తేదీ వరకు మరో రెండు, 11 వరకు 18 ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేసినట్లు వారు పేర్కొన్నారు. వీటితో పాటు మౌలాలి – అమ్ముగూడ – సనత్ నగర్ మార్గంలో నడిచే హైదరాబాద్ – సిర్పూర్ కాగజ్‌నగర్, వికారాబాద్ – గుంటూరు, రేపల్లె – సికింద్రాబాద్ ఎక్స్ ప్రెస్ లను షెడ్యూల్ వారీగా ఆపేస్తామని వివరించారు.




**అందుబాటులోకి రానున్న మరో టెర్మినల్..**

హైదరాబాద్ లోని చర్లపల్లిలో నిర్మిస్తున్న రైల్వే టెర్మినల్ ఈ ఏడాది మార్చి చివరినాటికి సిద్ధమవుతుందని దక్షిణ మధ్య రైల్వే జీఎం చెప్పారు. ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా సనత్‌నగర్ – మౌలాలి మధ్య రెండో లైను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. దీంతో సికింద్రాబాద్ స్టేషన్‌ను బైపాస్ చేస్తూ కొన్ని రైళ్లను నడిపే అవకాశం కలుగుతుందని వివరించారు.

## ఏపీ మంత్రికి బిగ్ రిలీఫ్.. సీబీఐ క్లీన్ చిట్

**తెలంగాణ వీణ , జనరల్ :** ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చింది. నెల్లూరు కోర్టు ఫైళ్ల మిస్సింగ్ కేసులో సీబీఐ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. ఫైళ్ల మిస్సింగ్ కేసులో కాకాణి పాత్ర లేదంటూ ఛార్జ్ షీట్‌లో సీబీఐ స్పష్టం చేసింది. మంత్రి కాకాణికి నేరం జరిగిన విధానం పట్ల అవగాహన లేదని పేర్కొన్నారు. ఏడాది పాటు విచారణ జరిపి, 403 పేజీల చార్జ్ షీట్ దాఖలు సీబీఐ.. 88 మంది సాక్షులను ప్రశ్నించింది. మంత్రిపై వచ్చిన ఆరోపణలను కొట్టిపారేసిన సీబీఐ.. మంత్రి కాకాణికి దోషులతో ఎలాంటి సంబంధం లేదని తెలిపింది .



ఏపీ పోలీసుల విచారణను సీబీఐ సమర్థించింది. పోలీసులు నిర్ధారించిన సయ్యద్ హయత్, షేక్ ఖాజా రసూల్‌లను సీబీఐ దోషులుగా నిర్ధారించింది. దొంగతనాలు అలవాటున్న వీరే కోర్టులో ఉన్న బ్యాగ్ దొంగిలించారని చార్జ్ షీట్‌లో స్పష్టం చేసింది. నెల్లూరు కోర్టు ఫైళ్ల మిస్సింగ్ కేసుపై హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ విచారణ చేపట్టింది. సీబీఐ విచారణకు తాను సిద్ధమని హైకోర్టులో మంత్రి కాకాణి ముందే చెప్పారు. సీబీఐ విచారణ జరపాలని హైకోర్టును మంత్రి కోరారు. సీబీఐ విచారణకు అభ్యంతరం లేదని అప్పట్లోనే హైకోర్టుకి అడ్వకేట్ జనరల్ తెలిపారు. టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి విదేశాల్లో రూ.వేల కోట్ల ఆస్తులున్నాయని కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరపించారు. దీనిపై ఆధారాలున్నాయంటూ పత్రాలను విడుదల చేశారు.. అవి ఫోర్జరీవని సోమిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కాకాణిని ఏ1గా పేర్కొంటూ పోలీసులు 2016లో కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించిన కేసు ఆధారాలు నెల్లూరు నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి ఈ ఏడాది ఏప్రిల్‌లో చోరీ అయ్యాయి. ఈ వ్యవహారంపై నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి (పీడీజే) నివేదిక ఆధారంగా దీన్ని సుమోటోగా తీసుకున్న హైకోర్టు.. మంత్రి కాకాణితోపాటు 18 మంది ప్రతివాదులకు నోటీసులిచ్చి విచారించి తీర్పును వాయిదా వేసింది. ఆ తర్వాత ఈ కేసులో ఫైళ్ల చోరీపై దర్యాప్తును సీబీఐకి అప్పగించింది ఏపీ హైకోర్టు.

## కేంద్ర ఎన్నికల సంఘానికి అచ్చెన్నాయుడు లేఖ!

**తెలంగాణ వీణ , జనరల్ :** కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ)కి టీడీపీ ఏపీ చీఫ్ అచ్చెన్నాయుడు లేఖ రాశారు. ఇటీవల జరిగిన డీఎస్పీల బదిలీలపై సీఈసీకి అచ్చెన్నాయుడు ఫిర్యాదు చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిచేకూరేలా డీఎస్పీల బదిలీలు ఉన్నాయని సీఈసీకి ఆయన కంప్లైంట్ చేశారు. అధికార వైసీపీకి అనుకూలంగా ఉన్నారంటూ 10 మంది డీఎస్పీల పేర్లను సీఈసీ దృష్టికి టీడీపీ ఏపీ చీఫ్ తీసుకెళ్లారు. డీఎస్పీలపై ఉన్న అభియోగాలనూ కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి అచ్చెన్నాయుడు తీసుకెళ్లారు.'వైసీపీకి అనుకూలంగా ఉండే డీఎస్పీలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బదిలీ చేశారు. తాజాగా చేపట్టిన 42 మంది డీఎస్పీల బదిలీలపై విచారణ చేపట్టాలి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీకి సహకరించాలని బదిలీ అయిన డీఎస్పీలకు డీజీపీ స్పష్టంగా చెప్పారు' అని కేంద్ర ఎన్నికల సంఘంకు ఫిర్యాదు చేసిన లేఖలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## ఆదరణ కోల్పోతున్న నిర్మల్ కొయ్య బొమ్మలు..



**తెలంగాణ వీణ, జనరల్ :** నిర్మల్ కోయ బొమ్మలు ప్రపంచ వ్యాప్తంగా చేరుతున్నాయి. ఆన్‌లైన్ దిగ్గజం అమెజాన్‌లో ఈ బొమ్మలను అందుబాటులో ఉంచేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీంతో కోయ బొమ్మలు తయారు చేస్తున్న వారికి ఈ రూపంలో ఓ భరోసా లభించింది. అయితే.. అటువంటి ప్రసిద్ధ కళాఖండాలను రూపొందించడానికి కర్రలు కొరతగా మారుతుంది. ఆదిలాబాద్ జిల్లాలో లభించే పోనికి కర్ర, చింత గింజల పొడితో ఈ కళాఖండాలను తయారుచేస్తున్నారని, అయితే అడవుల్లో ఈ చెట్లు తగ్గిపోవడంతో ప్రస్తుతం కర్ర అందుబాటులో లేదని స్థానిక కళాకారులు చెబుతున్నారు. కొన్నిసార్లు వారే స్వయంగా అడవుల్లో చెట్లను వెతికి అటవీశాఖ సమాచారం ఇచ్చి టెండర్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు.అటవీ మైదానంలో ప్లాంటేషన్ ద్వారా డిమాండ్ ఉన్న చెరుకును పెంచేందుకు అటవీశాఖ మూడేళ్ల క్రితమే కసరత్తు ప్రారంభించింది. నిర్మల్ జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అటవీ శాఖ సీసీఎఫ్ శరవణన్ పోని చెట్లను పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఇంత చరిత్ర కలిగిన చెక్క బొమ్మల తయారీ కేంద్రం పరిస్థితి భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారనుందని స్థానిక చేతివృత్తుల వారు వాపోతున్నారు. పరిస్థితిని తట్టుకుని నిలబడలేకపోతున్నారు. ఎలాంటి యంత్రాలు వాడకుండా కేవలం చేతితో చేసే కళా వృత్తి తమ చేతుల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలు ఈ వృత్తిని నేర్చుకోలేకపోతున్నారని, ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం పోటీ పడుతున్నరని, ఈ వృత్తి తాము ఉన్నంత వరకే సాగుతుందేమోనని భయపడుతున్నారు. గతంలో దాదాపు 200కు పైగా కుటుంబాలు ఈ వృత్తిని చేపట్టేవారని, ఇప్పుడు అది పదుల సంఖ్యలో చేరిందన్నారు. ఇలాగే కొనసాగితే మరో 10 నుంచి 15 ఏళ్ల పాటు ఈ వృత్తి కొనసాగే అవకాశం ఉంది. 17వ శతాబ్దంలో నిర్మల్ రాజ్యాన్ని పరిపాలించిన నిర్మల నాయుడు దేశం నలుమూలల నుండి అనేక మంది కళాకారులను రప్పించి రాజ్యంలో అనేక స్థానిక నిర్మాణాలు చేయగా అందులో నకశీలలు భాగమయ్యారు. ఈ నకాషి కులానికి చెందిన వారు స్థానికంగా లభించే పోనికి కర్రతో వివిధ కళాఖండాలను తయారు చేస్తారు. నిమ్మల రాజు ఈ శిథిలాలను చూసి మంత్రముగ్ధుడై వాటికి కావాల్సిన ఏర్పాట్లు చేశాడు. అప్పటి నుండి వారి హస్తకళ వివిధ ప్రాంతాలకు విస్తరించింది.. 1955 లో కళాఖండాలను వివిధ ప్రాంతాలకు పంపి ఉపాధి పొందేందుకు ఒక పారిశ్రామిక సంఘం ఏర్పడింది. అయితే..ఇప్పుడు 400 ఏళ్లనాటి కోయ బొమ్మల తయారీ పరిశ్రమకు ఆదరణ లేక కుంటుపడుతుందని స్థానిక కళాకారులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## తెలంగాణవాసులకు అలర్ట్..

**తెలంగాణ వీణ , జనరల్ :** తెలంగాణలో ఎండల తీవ్రత పెరుగుతోంది. కొద్ది రోజులుగా అన్ని జిల్లాల్లో పగటిపూట 31 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఐదు రోజుల నుంచి ఖమ్మంలో సాధారణం కన్నా 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత ఉంటోంది. హైదరాబాద్‌లోనూ 1.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మహబూబ్‌నగర్, మెదక్, భద్రాచలం, హనుమకొండ ప్రాంతాల్లోనూ ఎండ తీవ్రత కనిపిస్తోంది. గాలిలో తేమ శాతం తగ్గిపోతుండటమే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు రాత్రిపూట ఉష్ణోగ్రతల్లోనూ మార్పులు మొదలయ్యాయి. ఆదిలాబాద్, రామగుండంలలో సాధారణం కన్నా 5 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. గతేడాదిలాగే.. ఈ ఏడాది వేసవిలోనూ అత్యంత వేడిగా ఉండనున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. గత వేసవిలో ఎల్‌నినో ప్రభావంలా ఈ ఏడాది కూడా అవే పరిస్థితులు ఉంటాయంటున్నారు. ఈ ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశలున్నాయని.. వాతావరణ మార్పుల వల్లే సాధారణ ఉష్ణోగ్రతల్లో మార్పులు జరుగుతున్నాయంటున్నారు. ఈనెల చివరివారంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని భావిస్తున్నారు. మార్చి 20 తర్వాత అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఓ అంచనా ఉంది.



## కుమారీ ఆంటీ ఫుడ్ స్టాల్ ముందు నిరుద్యోగులు నిరసన

**తెలంగాణ వీణ , జనరల్ :** కుమారీ ఆంటీ.. ఇప్పుడు సినిమా తారలను మించిన ఓ పెద్ద సెలబ్రిటీ.. మొన్నటివరకు ఇన్‌స్టా గ్రామ్ రీల్స్, యూట్యూబ్ వీడియోలు చూసే వారికి, మాదాపూర్ పరిసరాల్లో ఉండే వారికి మాత్రమే తెలిసిన కుమారీ ఆంటీ ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో బాగా ఫేమస్ అయిపోయింది. ఆమె ఫుడ్ స్టాల్‌కు విపరీతమైన డిమాండ్ పెరగడం, ఇది ట్రాఫిక్ సమస్యలకు దారి తీయడం, పోలీసులు ఆమె షాపును క్లోజ్ చేయించడం, సీఎం రేవంత్ రెడ్డి స్పందించడం.. ఇలా ఒక్కసారిగా వార్తల్లో వ్యక్తిగా మారిపోయారామె. త్వరలోనే ఆమె ఫుడ్ స్టాల్‌ను కూడా సందర్శిస్తానని రేవంత్ మాట కూడా ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. దీంతో పలు యూట్యూబ్ ఛానెల్స్ కుమారీ ఆంటీ ఇంటర్వ్యూల కోసం పోటీ పడుతున్నాయి. అయితే సోషల్ మీడియా క్రేజ్‌తో ఎలాంటి ఉపయోగాలున్నాయో అదే స్థాయిలో ప్రతికూల అంశాలున్నాయి. కొన్నిసార్లు కుమారీ ఆంటీకి పెరుగుతోన్న క్రేజ్ ఆమెకే తలనొప్పులు తెచ్చిపెడుతోంది.తాజాగా కుమారీ ఆంటీ ఫుడ్ స్టాల్ ముందు కొందరు నిరుద్యోగులు నిరసనకు దిగారు. జీవో 46కు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. కుమారీ ఆంటీకి సమస్య వస్తే వెంటనే స్పందించిన సీఎం తాము 6 నెలలుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకోవడం లేదంటూ వాపోయారు. సీఎం రేవంత్ రెడ్డి మీ ఫుడ్ స్టాల్ వద్దకు వస్తాను అన్నారు కదా ఆంటీ జీవో 46 రద్దు చేయమని మీరైనా ఆయనతో చెప్పండి అంటూ నిరుద్యోగులు నిరసనకు దిగారు. ఫుడ్ స్టాల్ చుట్టూ గూమిగూడి కుమారీ ఆంటీని బాగా ఇబ్బంది పెట్టారు. ప్రస్తుతం దీనికి సంబంధించన వీడియో సామాజి క మాధ్యమాల్లో వైరల్ గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు.





## అమ్రపాలికి రేవంత్ సర్కారు కీలక బాధ్యతలు..



**తెలంగాణ వీణ, జనరల్ :** ఐఏఎస్ ఆమ్రపాలికి రేవంత్ సర్కార్ మరో కీలక బాధ్యతను అప్పగించింది. ఆమ్రపాలి ప్రస్తుతం HMDA– IT – ఎస్టేట్ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ MD గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవలే ఆమెకు హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఔటర్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, మెట్రోపాలిటన్ కమిషనర్ డా.ఎం. దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక తెలుగింటి ఆడపడుచు అమ్రపాలి.. తెలంగాణ కేడర్ అధికారిణి. గతంలో కేంద్రంలో పనిచేసిన యువ ఐఏఎస్ లు ఎన్నికల అనంతరం తెలంగాణకు తిరిగి వచ్చేశారు. అనంతరం హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఐఏఎస్‌లలో అమ్రపాలి తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.ఆమ్రపాలి విశాఖపట్నంలో చదివి సత్తాచాటి 2010 యూపీఎస్సీ సివిల్స్‌లో 39వ ర్యాంకు సాధించింది. తర్వాత ట్రైనీ ఐఏఎస్‌గా, జాయింట్ కలెక్టర్‌గా, సిటీ కమిషనర్‌గా పనిచేశారు. 2018లో వరంగల్ జిల్లా అర్బన్, రూరల్ కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత డిప్యూటేషన్‌పై పీఎంవోలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మరోవైపు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిషోర్ హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 6న హెచ్ ఎండీఏపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం.శనివారం హెచ్ ఎండీఏ కార్యాలయానికి వచ్చి బిజీబిజీగా గడిపారు. వివిధ ప్రాజెక్టుల పురోగతిని అధికారులతో సమీక్షించారు. అత్యవసరంగా పరిష్కరించాల్సిన ఫైళ్లను కూడా పరిశీలించారు.

## తెలుగు కళామతల్లికి చిరంజీవి మూడో కన్ను: వెంకయ్యనాయుడు

**తెలంగాణ వీణ , జనరల్ :** పద్మ అవార్డుల గ్రహీతలకు నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. దేశంలోనే రెండో అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ కు ఎంపికైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, పద్మ అవార్డులకు అర్హులను ఎంపిక చేయడంలో కొత్త విధానం కనిపిస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తోందని కొనియాడారు. గుర్తింపు దక్కని వ్యక్తులను గుర్తించి పద్మ పురస్కారాలు ఇస్తోందని వివరించారు. తెలుగు సినీ కళామతల్లికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్ల వంటి వారైతే... చిరంజీవి మూడో కన్ను అని వెంకయ్యనాయుడు అభివర్ణించారు. చిరంజీవికి పద్మ విభూషణ్ అవార్డు రావడం సంతోషం కలిగించిందని అన్నారు. ఇష్టమైన పనిని కష్టపడి చేస్తే నష్టపోయేది ఏదీ ఉండదని... పట్టుదలకు కృషి తోడైతే ఏదైనా సాధ్యమేనని పేర్కొన్నారు. నేను జీవితంలో పెద్దగా అవార్డులు తీసుకోలేదు, సన్మానాలు పొందలేదు. మీకు అవార్డు ఇస్తున్నాం అని కేంద్రం చెప్పింది... మోదీ మీద గౌరవంతో అవార్డు తీసుకుంటున్నా" అని స్పష్టం చేశారు. ఇక, ప్రజా జీవనంలో ఉన్న వ్యక్తులు విలువలు పాటించాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ఇటీవల పార్లమెంటు, అసెంబ్లీలో జరుగుతున్న ఘటనలు బాధాకరమని తెలిపారు.



## చంద్రబాబు నివాసానికి పవన్

**తెలంగాణ వీణ , జనరల్ :** ఏపీలో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన మధ్య సీట్ల సర్దుబాటు ఇంకా ఓ కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నేడు ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబు నివాసానికి వెళ్లారు. పవన్ కు చంద్రబాబు, అచ్చెన్నాయుడు పుష్పగుచ్ఛాలు అందించి సాదర స్వాగతం పలికారు. అనంతరం, చంద్రబాబు, పవన్ సమావేశమయ్యారు. ప్రధానంగా సీట పంపకం గురించే చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. టీడీపీ 25 సీట్లు ఇస్తామని చెబుతుండగా, మరిన్ని సీట్లు కావాలని జనసేన అధినాయకత్వం కోరుతున్నట్టు సమాచారం.






# గుడ్ న్యూస్.. ఓటీటీలోకి రాబోతున్న 'గుంటూరు కారం'

**తెలంగాణవీణ, సినిమా :** ప్రిన్స్ మహేష్ బాబు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్(కాంబోలో వచ్చిన రీసెంట్ బ్లాక్ బస్టర్ 'గుంటూరు కారం'అతడు, ఖలేజా సినిమాల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా రావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ఈ సినిమా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. మొదటిరోజే ఈ సినిమాకు కొంచెం మిక్స్‌డ్ టాక్ రావడంలో కలెక్షన్ల మీద ప్రభావం పడుతుందని ట్రేడ్ వర్గాలు భావించాయి. కానీ ఆ అంచనాలను తలకిందులు చేస్తూ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోయింది. ఇప్పటివరకు ఏకంగా రూ.250 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ సినిమా ఫిబ్రవరి 9 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ తెలుపుతూ.. రౌడీ రమణని 70 ఎంఎం లో చూశారు. ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ లో చూడడానికి సిద్ధమవ్వండి. గుంటూరు కారం సినిమా తెలుగుతో పాటు తమిళం,మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఫిబ్రవరి 9 నుంచి స్ట్రీమింగ్‌కు రానుంది అంటూ



# కొండచిలువను పెంచుకుంటున్న స్టార్ హీరోయిన్!

**తెలంగాణవీణ, సినిమా :** కొండచిలువను ముట్టుకునేంత..కాదు కాదు దగ్గర నుంచి చూసేంత ధైర్యం ఉందా? భలేవాడివి బాసూ.. అదేమైనా కుక్క పిల్లా? లేదా పిల్లి పిల్లనా? ముట్టుకొని ముద్దాడడానికి? అంటారా? మీకే కాదు సహజంగా ఎవరికైనా పాములను చూడగానే భయం వేస్తుంది. ఎక్కడో దూరాన ఉన్న చిన్న పామును చూస్తేనే భయంతో పరుగులు తీసాం. అలాంటిది కొండచిలువలాంటి పాము మన దగ్గరకు వస్తే.. ఊహించుకుంటేనే భయం వేస్తోంది కదా? కానీ ఓ హీరోయిన్ మాత్రం కొండ చిలువను కుక్కపిల్ల మాదిరి ముద్దుగా పెంచుకుంటుందట. దాన్ని పట్టుకొని ముద్దులు కూడా పెడుతుందట. సాధారణంగా సెలబ్రిటీలు కుక్కపిల్లల్ని.. ఇంకా ముద్దొస్తే పిల్లి పిల్లల్ని పెంచుకోవడం గురించి వినే ఉంటారు! కానీ అలా ముచ్చటపడి పాములను పెంచుకోవడం గురించి విన్నారా? బాలీవుడ్ హీరోయిన్ సుష్మితా సేన్‌కి ఆ సరదా ఉందట. ఆమెకు పాములంటే పిచ్చి ఇష్టమట. ఆ ఇష్టంతోనే ఒక బుజ్జి కొండచిలువను పెంచుకుంటోందని బాలీవుడ్‌లో టాక్. ఖాళీ సమయం దొరికితే ఆ కొండ చిలువతో సరదాగా ఆడుకుంటుందట. అయితే తన కొండ చిలువకు సంబంధించిన విషయాలను సుష్మిత ఎక్కడా చెప్పలేదు కానీ..ఆమె సన్నిహితుల ద్వారా మీడియాకు ఈ విషయం లీకైంది. దీన్ని సుష్మిత ఖండించకపోవడంతో బాలీవుడ్ జనాలు ఇది నిజమనే నమ్ముతున్నారు.



# పద్మశ్రీ అవార్డు గ్రహీతకు 'దిల్ రాజు' సాయం

**తెలంగాణవీణ, సినిమా :** అంతరించిపోతున్న ఆ కళకు అతడే చివరి వారసుడు. బుర్రవీణను భుజాన మోస్తూ.. రామాయణం, ఆధ్యాత్మిక, గ్రామీణ కథలకు తగ్గట్లు వాయిద్యం వాయిస్తూ.. పాటలు పాడుతూ అందరినీ అబ్బురపరిచారు దాసరి కొండప్ప. వాయిద్యం, పాట మాత్రమే తెలిసిన అతడిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది. నారాయణపేట జిల్లా దామరగిద్దకి చెందిన ఒలియ దాసరి కుటుంబీకుడైన కొండప్పది ఎంతో నిరుపేద కుటుంబం.. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి ఆయనది.తాతల కాలం నుంచే బుర్రవీణ వాయిద్యంతో భిక్షాటన చేస్తూ తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం ఆయన్ను గుర్తించి దేశంలోనే నాలుగో అత్యున్నత పురస్కారం పద్మశ్రీ అందించడంతో ఆయన పేరు దేశవ్యాప్తంగా వైరల్ అయింది. కానీ కొన్ని సంవత్సరాలుగా తిరుమలరావు అనే వ్యక్తి ద్వారా ఆంధ్ర ప్రాంతంలో పాటలు పాడి తన కళకు గుర్తింపు సంపాదించారు.ఈ క్రమంలో ఆయన కళను గుర్తించిన ప్రముఖ నిర్మాత దిల్ రాజు తన కూతురు నిర్మించిన బలగం చిత్రంలో ఒక పాట పాడేందుకు అవకాశం ఇచ్చారు. ఆ చిత్రంలో 'అయ్యో శివుడా ఏమాయే ఎనకటి దానికి సరిపోయే' అనే పాటకు తన గాత్రాన్ని అందించాడు కొండప్ప. తాజాగా కొండప్పను తన ఆఫీస్‌కు దిల్ రాజు పిలుపించుకున్నారు. ఆపై ఆయన్ను సన్మానించి గౌరవించారు. దిల్ రాజుతో పాటు బలగం డైరెక్టర్ వేణు తదితరులు కొండప్పను అభినందించారు. అనంతరం దిల్ రాజు లక్ష రూపాయల చెక్కుని కొండప్పకు అందించారు.





# దళపతి విజయ్ చివరి సినిమా ఇదేనా..?

**తెలంగాణవీణ, సినిమా :** కోలీవుడ్ స్టార్ హీరో ఇళయ దళపతి విజయ్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. రీసెంట్‌గా 'తమిళ వెట్రి కళగం' అంటూ పార్టీ పేరు కూడా అనౌన్స్ చేశాడు. అయితే



ఈ పార్టీ 2024 ఎన్నికలలో పోటీ చేయబోవడం లేదని అలాగే ఏ పార్టీకి మద్దతు ఇవ్వట్లేదని విజయ్ తెలిపాడు. జనరల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మీటింగ్ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ఇక తన చివరి సినిమా కూడా దళపతి 69 అని చెప్పాడు. ఆ తర్వాత పూర్తిగా రాజకీయాలపైనే దృష్టి పెడుతున్నట్లు చెప్పి ఫ్యాన్స్‌కు బిగ్ షాక్ ఇచ్చాడు. అయితే అలా అనౌన్స్ చేశాడో లేదో విజయ్ తర్వాత ఆ ప్లేస్‌ను ఎవరు భర్తీ చేస్తారంటూ అభిమానులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు విజయ్ సినిమాలు మానేయడం తమిళ సినిమా బిజినెస్‌కు బాగా దెబ్బపడుతుందని.. ఆయన ఫ్లాప్ సినిమాలు సైతం ఇక్కడ మంచి బిజినెస్‌ను చేస్తాయని మాట్లాడుకుంటున్నారు. ఇదిలావుండగా విజయ్ చివరి సినిమా దళపతి 69పై అందరిలోనూ క్యూరియాసిటీ ఏర్పడింది. మరీ ముఖ్యంగా టాలీవుడ్ ఆడియెన్స్ కూడా మాట్లాడుకుంటున్నారు. ఎందుకుంటే విజయ్ లాస్ట్ సినిమాను ప్రొడ్యూస్ చేస్తుంది మన తెలుగు నిర్మాత డి.వి.వి దానయ్య.

# అంబాజీపేట మ్యారేజి బ్యాండు

**తెలంగాణవీణ, సినిమా :** కలర్‌ఫొటో, రైటర్ పద్మభూషణ్ సినిమాలతో ప్రేక్షకులను మెప్పించిన యంగ్ హీరో సుహాస్. గతంలో వచ్చిన ఆ రెండు చిత్రాలు సూపర్ హిట్ కొట్టాయి. తాజాగా విడుదలైన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రం కూడా బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌తోనే దూసుకుపోతుంది. సమాజంలోని అంతరాలు, పరువు, ప్రేమ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా యూత్‌కు బాగా దగ్గరైందని చెప్పవచ్చు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో శివాని నాగరం హీరోయిన్‌గా మెప్పిస్తే.. హీరో అక్కగా శరణ్య ప్రదీప్ దుమ్మురేపిందని ప్రేక్షకులు తెలుపుతున్నారు. 'పుష్ప' ఫేమ్ జగదీశ్ ప్రతాప్ బండారి ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించాడు. జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ అయిన మోషన్ పిక్చర్స్,ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ చిత్రానికి తొలిరోజు అద్భుతమైన ఓపెనింగ్స్ దక్కాయి. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.2.28 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించినట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. తక్కువ బడ్జెట్‌లో తెరకెక్కిన ఈ చిత్రం అందరి అంచనాలకు మించి ఓపెనింగ్స్‌ను సాధించింది. హార్డ్ హిట్టింగ్ బ్లాక్‌బాస్టర్ అంటూ మేకర్స్ ఒక పోస్టర్‌ను కూడా రిలీజ్ చేసింది. ఈ మూవీకి విడుదలైన ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. దీంతో రెండో రోజు సుమారుగా రూ.3 కోట్ల వరకు కలెక్షన్స్ రాబట్టి ఉంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏదేమైనా హీరో సుహాస్ 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' సౌండ్ గట్టిగానే వినిపిస్తోంది.



# పూనం ఇదేం రోగం!.

**తెలంగాణవీణ, సినిమా :** వివాదాలకు కేరాఫ్‌గా ఉండే బాలీవుడ్ నటి పూనమ్ పాండే మరోమారు అభిమానులను షాక్‌కు గురిచేసింది. తన నకిలీ డెత్ స్టంట్ ప్రదర్శించి అందరూ నాలుక కరుచుకునేలా చేసింది. తాను చనిపోయినట్లు వ్యక్తిగత సిబ్బందితో శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టించారు పూనమ్. తీరా శనివారం ఉదయం పూనమ్ పాండే మళ్లీ ఇన్‌స్టా వేదికగా ప్రత్యక్షమైంది. తాను ఎక్కడికీ పోలేదని, బతికే ఉన్నానంటూ వీడియోలో మాట్లాడుతున్న పూనమ్‌ను చూస్తూ అందరూ నోరెళ్లబెట్టారు. పూనమ్ తాజా ఇన్‌స్టా పోస్టు ఇలా ఉంది.. 'మీ అందరితో ఒక ముఖ్యమైన విషయం పంచుకోవాలనుకుంటున్నా. నేను ఎక్కడికీ వెళ్లలేదు. బతికే ఉన్నా. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో బాధపడుతున్న నేను ప్రాణాలు కోల్పోలేదు. కానీ, ఈ వ్యాధి ఇప్పటికే వేలాది మంది మహిళల ప్రాణాలు హరించింది. ఇది ఇతర క్యాన్సర్ల మాదిరిగా ప్రమాదకరం కాదు. దీన్ని నివారించడం సాధ్యమే. హెచ్‌పీవీ వ్యాక్సీన్ తీసుకోవడమో లేదా వ్యాధిని ముందస్తుగా గుర్తించడమో అవసరం. ఈ వ్యాధితో ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు చాలా దారులున్నాయి. అందరికీ అవగాహన కల్పిద్దాం. నిశబ్దంగా ప్రాణాలను హరిస్తున్న ఈ డిసీజ్ గురించి తీవ్రస్థాయిలో చర్చ జరగాలన్న ఉద్దేశంతోనే నా మరణ వార్తను వ్యాపింపజేశాను. ఈ వార్త అందరినీ ఇబ్బంది పెడుతుందని తెలుసు. అందుకు నన్ను క్షమించండి' అని ఆమె పేర్కొన్నారు.



# ధనుష్ అల్లుడు హీరో

**తెలంగాణవీణ, సినిమా :** తమిళ హీరో ధనుష్ గురించి హీరోగా చేస్తూనే నిర్మాత, దర్శకుడిగానూ ఆశ్చర్యపరుస్తున్నారు. స్వీయ దర్శకత్వంలోనూ ఓ మూవీ చేస్తున్నారు.సన్ పిక్చర్స్ నిర్మాణ సంస్థ తీస్తున్న ఈ సినిమా షూటింగ్ తాజాగా పూర్తయింది. అనికా సురేంద్రన్, దుషారా విజయన్ ఇందులో హీరోయిన్లుగా నటించారు. ఇకపోతే ఈ మూవీకి 'రాయన్' అనే టైటిల్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ వేసవికి ఈ చిత్రం థియేటర్లలోకి వచ్చే అవకాశముంది. తాజాగా ధనుష్.. దర్శక నిర్మాతగా మరో సినిమా తీయబోతున్నట్లు సమాచారం. తన సోదరి కొడుకుని హీరోగా పరిచయం చేస్తూ ఈ మూవీ చేయబోతున్నారట. ఇందులో ధనుష్ అతిథి పాత్రలోనూ నటిస్తారని టాక్. ఈ ప్రాజెక్ట్ గురించి ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.





# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

# క్రీడలు




## శుభ్‌మన్ గిల్ ఒంటరి పోరాటం..

**తెలంగాణవీణ, క్రీడలు :** వైజాగ్ టెస్టులో భారత జట్టు భారీ ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. యువకెరటం శుభ్‌మన్ గిల్(60 నాటౌట్ : 78 బంతుల్లో 8 ఫోర్లు, సిక్సర్) హాఫ్ సెంచరీ బాదడంతో పటిష్ఠ స్థితిలో నిలిచిన టీమిండియా లంచ్ టైమ్‌కు 4 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. ప్రస్తుతానికి రోహిత్ సేన 273 పరుగుల ఆధిక్యంలో ఉంది. అక్షర్ పటేల్(2) క్రీజులో ఉన్నాడు. ఉప్పల్‌లో జరిగిన తొలి టెస్టులో విఫలైమన గిల్.. వైజాగ్ మ్యాచ్‌లో విలువైన ఇన్నింగ్స్‌తో జట్టును గట్టెక్కించాడు. 35 పరుగులకే 2 వికెట్లు పడిన దశలో.. ఇన్నింగ్స్ నిర్మించే బాధ్యత తీసుకున్న గిల్ తనదైన షాట్లతో అలరించాడు.



## ఫుట్‌బాల్ స్టార్ ఎంబాపే కీలక నిర్ణయం.. ఆ క్లబ్‌తో తెగతెంపులు

**తెలంగాణవీణ, క్రీడలు :** ఫ్రాన్స్ స్టార్ ఫుట్‌బాలర్ కిలియన్ ఎంబాపే కీలక నిర్ణయం తీసుకున్నాడు. కొత్త క్లబ్‌కు మారడంపై కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు తెరదించాడు. ఎట్టకేలకు పారిస్ సెయింట్ జర్మనీ క్లబ్‌ను వీడేందుకు సిద్ధమయ్యాడు. త్వరలోనే రియల్ మాడ్రిడ్ కు చెందిన ఎంబాపే లా లిగా క్లబ్‌తో ఈ ఫార్వర్డ్ ప్లేయర్ జట్టు కట్టనున్నాడు. అతడు2023-24 సీజన్ తర్వాత లా లిగాకు మారనున్నాడని ఫ్రాన్స్‌కు చెందిన వార్త పత్రిక లే పరిసియెన్వెల్లడించింది. ఎంబాపే 2007లో మొనాకో క్లబ్ నుంచి పీఎస్‌జీలో చేరాడు. అప్పటి నుంచి ఇప్పటివరకూ అదే క్లబ్‌తో కొనసాగుతున్నాడు.



## టెస్టుల్లో మూడో శతకం బాదిన గిల్..

**తెలంగాణవీణ, క్రీడలు :** వైజాగ్ టెస్టులో శుభ్‌మన్ గిల్(101 నాటౌట్ : 136 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీ కొట్టాడు. షోయబ్ బషీర్ బౌలింగ్‌లో సింగిల్ తీసి శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ ఏడాది భారీ స్కోర్ బాకీ పడిన గిల్.. 132 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో మూడంకెల స్కోర్ సాధించాడు. ఇంగ్లండ్ బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ.. టెస్టుల్లో మూడో సెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. గత 13 ఇన్నింగ్స్‌లో నిరాశ పరిచిన గిల్.. జట్టుకు అవసరమైన సమయంలో సెంచరీతో విమర్శకుల నోళ్లు మూయించాడు. మరో ఎండ్‌లో అక్షర్ పటేల్(33 నాటౌట్) చక్కని సహకారం అందిస్తున్నాడు. లంచ్ టైమ్‌కు 4 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసిన రోహిత్ సేన ప్రస్తుతం 4 వికెట్ల నష్టానికి 201 రన్స్ కొట్టింది.



## కీపర్‌కు బంతి ఇచ్చినందుకు ఔట్...

**తెలంగాణవీణ, క్రీడలు :** అండర్ -19 ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్ ఆటగాడు అనూహ్యరీతిలో ఔటయ్యాడు. ఫీల్డింగ్ జట్టు వికెట్ కీపర్‌కు సాయం చేయబోయిన హమ్జా షేక్ నిరాశగా పెవిలియన్ చేరాడు. అసలే ఏం జరిగిందంటే.. సూపర్ సిక్స్ స్టేజ్‌లో భాగంగా శనివారం జింబాబ్వే, ఇంగ్లండ్ తలపడ్డాయి. రియాన్ సింబీ వేసిన 17వ ఓవర్‌లో హమ్జా బంతిని డిఫెన్స్ చేశాడు. ఆ బంతి వికెట్లకు దగ్గర పడింది. స్టంప్స్ వెనకాల ఉన్న రియాన్ కమ్‌వెంబా బంతిని తీసుకునేందుకు వస్తుండగానే హమ్జా చేత్తో బంతిని పట్టుకొని అతడికి ఇచ్చాడు. అది చూసిన బౌలర్ అప్పీల్ చేశాడు. దాంతో, ఫీల్డింగ్‌కు అంతరాయం కలిగించాడనే నెపంతో ఆన్‌ఫీల్డ్ అంపైర్, థర్డ్ అంపైర్‌లు హమ్జాను ఔట్‌గా ప్రకటించాడు. ఊహించని పరిణామంతో, హమ్జా ఒక్కసారిగా షాకయ్యాడు.



## అండర్సన్ మ్యాజిక్ డెలివరీ..

**తెలంగాణవీణ, క్రీడలు :** వైజాగ్ వేదికగా టీమిండియాతో జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లండ్ వెటరన్ పేసర్ జేమ్స్ అండర్సన్ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు పడగొట్టిన అండర్సన్.. రెండో ఇన్నింగ్స్‌లో కూడా సత్తాచాటుతున్నాడు. సెకెండ్ ఇన్నింగ్స్‌లో ఇప్పటివరకు రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. మూడో రోజు ఆట సందర్భంగా అండర్సన్ సంచలన బంతితో మెరిశాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో ఓవర్‌నైట్ స్కోర్‌కు ఒక్క పరుగు కూడా జత చేయకుండానే వెనుదిరిగాడు. భారత ఇన్నింగ్స్ 7 ఓవర్ వేసిన అండర్సన్.. నాలుగో బంతిని రోహిత్‌కు అద్భుతమైన ఔట్ స్వింగర్‌ను సంధించాడు. ఈ క్రమంలో హిట్‌మ్యాన్ డిఫెన్స్ ఆడటానికి ప్రయత్నించాడు.అయితే బంతి రోహిత్ బ్యాట్‌కు మిస్స్ అయ్యి ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. ఈ మ్యాజిక్ డెలివరీకి రోహిత్ బిత్తరపోయాడు.



## టీ20 మ్యాచ్‌లో బ్యాటర్ల ఊచకోత..

**తెలంగాణవీణ, క్రీడలు :** సౌతాఫ్రికా టీ20 లీగ్-2024లో జో బర్గ్ సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. జోహన్నెస్‌బర్గ్ వేదికగా డర్బన్ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో విజయం సాధించిన సూపర్ కింగ్స్.. ప్లే ఆఫ్ బెర్త్‌ను ఖారారు చేసుకుంది. కాగా ఈ మ్యాచ్‌లో పరుగుల వరద పారింది.ఈ మ్యాచ్‌లో రెండు జట్లు కలిపి ఏకంగా 412 పరుగులు చేశాయి. ఇరు జట్ల బ్యాటర్లు ఏకంగా 20 సిక్స్‌లు బాదారు. తొలుత బ్యాటింగ్ చేసిన డర్బన్ సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. సూపర్ జెయింట్స్ బ్యాటర్లలో జేజే స్మట్స్(55), ముల్డర్(59) హాఫ్ సెంచరీలతో సత్తచాటగా.. ఆఖరిలో క్లాసెన్(16 బంతుల్లో 40, 3 సిక్స్‌లు, 3 ఫోర్లు) మెరుపులు మెరిపించాడు. అనంతరం 204 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సూపర్ కింగ్స్ 19.3 ఓవర్లలో కేవలం 3 వికెట్లు మాత్రమే నష్టపోయి ఛేదించింది. సూపర్ కింగ్స్ బ్యాటర్లలో కెప్టెన్ డుప్లెసిస్(29 బంతుల్లో 57), లూస్ డిప్లె(57) హాఫ్ సెంచరీతో సత్తాచాటారు. వీరిద్దరితో పాటు మడ్సన్(44 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. సూపర్ జెయింట్స్ బౌలర్లలో నూర్ ఆహ్మద్ రెండు, ప్రిటోరియస్ ఒక్క వికెట్ పడగొట్టాడు.



## భారత్ 2 పాక్ 0

**తెలంగాణవీణ, క్రీడలు :** డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ పోటీలో భారత టెన్నిస్ జట్టు తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. పాకిస్తాన్‌తో జరుగుతున్న ఈ పోటీలో తొలిరోజు శనివారం జరిగిన రెండు సింగిల్స్ మ్యాచ్‌లోనూ భారత క్రీడాకారులు రామ్‌కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ విజయం సాధించారు. ఫలితంగా ఐదు మ్యాచ్‌ల ఈ పోటీలో ప్రస్తుతం భారత్ 2-0తో ఆధిక్యం సంపాదించింది. నేడు జరిగే మిగతా మూడు మ్యాచ్‌ల్లో (డబుల్స్, రెండు రివర్స్ సింగిల్స్) ఒకదాంట్లో గెలిచినా భారత జట్టు విజయం ఖరారవుతుంది.



## అతడికిదే తొలి పర్యటన.. నా స్పెల్ అంకితం చేస్తున్నా

**తెలంగాణవీణ, క్రీడలు :** ఇంటర్నెట్ డెస్క్: రెండో టెస్టు మ్యాచ్‌లో ఆరు వికెట్ల ప్రదర్శనతో జస్‌ప్రీత్ బుమ్రా (6/45) ఇంగ్లాండ్‌ను బెంబేలెత్తించాడు. బెన్ స్టోక్స్, ఓలీ పోప్, జో రూట్ వంటి టాప్ బ్యాటర్లను బోల్తా కొట్టించాడు. టెస్టుల్లో మరోసారి అత్యుత్తమ గణాంకాలను నమోదు చేశాడు. భారత్ తరఫున వేగంగా 150+ వికెట్లు పడగొట్టిన పేసర్‌గా నిలిచాడు. ఇలాంటి అద్భుత స్పెల్‌ను ఎవరికి అంకితం చేస్తావని బుమ్రాను ప్రశ్నించగా.. ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. ఆ వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది.

"టెస్టుల్లో వేగంగా 150 వికెట్ల మైలురాయిని సాధించడం ఆనందంగా ఉంది. జట్టు విజయం సాధించినప్పుడే.. ఈ ప్రదర్శనకు ఓ అర్థముంటుంది. అంతకుమించిన ఆనందమూ ఉండదు. ఈ స్పెల్‌ను నా కుమారుడికి అంకితం ఇస్తున్నా. అతడితో కలిసి పర్యటించడం ఇదే తొలిసారి. నాకు ఇదెంతో స్పెషల్. టెస్టుల్లో నా వందో వికెట్ ఓలీ పోప్. 2021 పర్యటనలో ఓవల్ మైదానంలో అతడిని ఔట్ చేశా. ఇప్పుడు మరోసారి పోప్‌ను పెవిలియన్‌కు చేర్చా. లెంగ్త్ బాల్ వేద్దామని తొలుత భావించినా.. ఆఖర్లో యార్కర్ సంధించా. వికెట్ దక్కింది. స్వింగ్ కావడంతో పోప్ కూడా ఎదుర్కోలేకపోయాడు. బెన్ స్టోక్స్ వికెట్ కోసం ఎలాంటి ప్లాన్ చేయలేదు. ఔట్ స్వింగర్ కోసం ప్రయత్నించా. కానీ, బంతి స్వింగ్ కాలేదు. నేరుగా వికెట్ల మీదకు వెళ్లిపోయింది. టెస్టు ఫార్మాట్‌లో బౌలింగ్ చేయడాన్ని చాలా ఇష్టపడతా" అని బుమ్రా వ్యాఖ్యానించాడు.

